క్లుప్తంగా

పడాల భౌతికకాయానికి నివాళి

అంతిమ యాత్రలో ఎంపీ భరత్



పెదవెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని మోస్తున్న ఎంపీ భరత్‌రామ్ తదితరులు

సీటీఆర్‌ఐ: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పడాల పెద వెంకటేశ్వరరావు హఠాన్మరణంతో రాజమహేంద్రవరం వైఎస్సార్ సీపీ శ్రేణులు శోక సంద్రంలో మునిగిపోయాయి. విషయం తెలియగానే రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. హుటాహుటిన పడాల పెద వెంకటేశ్వరరావు నివాసానికి చేరుకుని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. పడాల అంతిమ యాత్రలో ఎంపీ భరత్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు. అంతిమ యాత్రలో పడాల పెద వెంకటేశ్వరరావు పార్థివ దేహాన్ని రుద్ర భూమికి తోడ్కొని వెళ్ళే వాహనం వరకూ ఎంపీ భరత్, అడపా శ్రీహరి పాడిని తమ భుజాలపై పెట్టుకొని వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ పడాల పెద వెంకటేశ్వరరావు మరణం రాజమహేంద్రవరం వైఎస్సార్ సీపీకి తీరని లోటు అన్నారు. ఎవరూ భర్తీ చేయలేనిదని అన్నారు. నగరంలోని కోటగుమ్మం వద్ద మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ వ్యవస్థాపకుడు పడాల అని గుర్తు చేశారు. వైఎస్సార్ అన్నా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నా వెంకటేశ్వరరావుకు ఎంతో అభిమానం అని ఎంపీ భరత్ తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

లారీ మిస్సింగ్‌పై కేసు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురానికి చెందిన పరిమి దేవి సిద్ధార్థ తన లారీ కనిపించడం లేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 25న లారీని గోపాలపురం మండలం ఏళ్లచింతలగూడెంకు చెందిన డ్రైవర్ బొల్లిన శ్రీరామకృష్ణ కూనవరం శ్రీ మెట్ట గంగాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉంచాడని, మరునాడు చూడగా అక్కడ లారీ లేకపోవడంతో శనివారం సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొవ్వూరు: పట్టణ శివారున ఏషియన్ పెయింట్స్ గోడౌన్ సమీపంలో హైవే పై ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వాహనం వ్యక్తి పై నుంచి వెళ్లడంతో శరీరం పూర్తిగా నుజ్జు నుజ్జు అయ్యింది. యాచకుడై ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. హైవే పెట్రోలింగ్ పోలీసు సహకారంతో ఆ మృతదేహాన్ని పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. సంఘటన స్థలంలో ఏవిధమైన ఆధారాలు లభ్యం కాలేదని సీఐ తెలిపారు.

మద్యం సీసాల సీజ్

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంకకు చెందిన వీరమల్ల మంగాలక్ష్మిని అరెస్ట్ చేసి ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. 180 ఎంఎల్ క్లాసిక్ బ్లూ విస్కీ సీసాలు 4, సిల్వర్ స్ట్రిప్స్ ఒరిజినల్ రిజర్వ్ విస్కీ సీసాలు 4 శనివారం రాత్రి స్వాధీనం చేసుకుని మంగాలక్ష్మిపై కేసు నమోదు చేశామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

సినిమాలు

శ్యామల	: ఊరుపేరు భైరవకోన
సూర్యమినీ	: మేడమ్‌వెబ్
సూర్యప్యాలెస్	: ఊరుపేరు భైరవకోన
స్వామి	: ఈగల్
శివజ్యోతి	: అంబాజీపేట మ్యారేజీబ్యాండు
అనుశ్రీ	: హనుమాన్
రాజా	: ఊరుపేరు భైరవకోన
ఊర్వశి	: యాత్ర-2
రంభ	: లాల్‌సలామ్
మేనక	: సూర్య సన్ ఆఫ్ కృష్ణన్,డ్రిల్
అప్సర	: గుంటూరుకారం
కుమారి	: ట్రూలవర్
నామవరం	
వివిఎస్.మహల్	: ఊరుపేరు భైరవకోన
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: ఊరుపేరు భైరవకోన
కడియం	
వెంకటసూర్య	: ఊరుపేరు భైరవకోన

సేంద్రియం.. ఆరోగ్యం..

- కూరగాయల వ్యర్థాలతో సేంద్రియ ఎరువు
- ఇంటిలోనే తయారు చేస్తున్న మహిళలు
- వాటితో కూరగాయల పెంపకం



సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు విక్రయిస్తున్న మహిళ

సీటీఆర్‌ఐ: ప్రస్తుతం నాణ్యమైన కూరగాయలు దొరకడం చాలా కష్టంగా మారింది. మార్కెట్‌లో లభ్యమైవుతున్న కూరగాయలను ఎరువులు వినియోగించి పండిస్తున్నారు. వాటిని తినడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో చాలా మంది తమ ఇళ్లపై, పెరట్లో కూరగాయలను పెంచుతున్నారు. వివిధ మొక్కలు, పాదులు పెట్టి వాటిని చాలా శ్రద్ధగా చూస్తున్నారు. అయితే వాటిని ఎంత జాగ్రత్తగా పెంచినా ఎరువులు చేయకుంటే పోషకాలు సక్రమంగా అందవు. దీంతో సేంద్రియ ఎరువు తయారీకి నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంది. రోజూ ఇంట్లో ఉపయోగించే కూరగాయల వ్యర్థాలతో మంచి ఎరువు తయారు చేసేలా శిక్షణ ఇచ్చింది. దీని వల్ల మొక్కలు పెంచడానికి అవసరమైన ఎరువును ఎవరికి వారే ఇళ్లలో తయారు చేసుకోవచ్చు.

పెట్టుబడి లేకుండా..

సాధారణంగా వ్యాపారం చేయాలంటే ముందుగా కొంత పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. తీరా పెట్టిన తరువాత ఆ డబ్బు తిరిగి వస్తుందన్న గ్యారెంటీ ఉండదు. అందుకే పెట్టుబడి లేని ఆదాయాల కోసం మహిళలు ఇప్పుడు ఇంటి ఆవరణలోనే గార్డెనింగ్ ద్వారా కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. వాటిని తాము వినియోగించుకోవడంతో పాటు, మిగిలిన వాటిని ఇతరులకు విక్రయిస్తున్నారు. కూరగాయలు పండించడానికి అవసరమయ్యే సేంద్రియ ఎరువులను కొనుగోలు చేయడానికి కొంత సొమ్ము ఖర్చు చేయాలి. దీనికోసం కార్పొరేషన్ వినూత్నంగా ఒక పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇంటిలోని వ్యర్థాల ద్వారా ఖర్చు లేకుండా సేంద్రియ ఎరువులు తయారు చేసుకోనేలా మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. ఈ శిక్షణ పొందిన మహిళలు ఇంటిలోనే హోం కంపోస్టు తయారు చేసుకుంటున్నారు. వీటిని సొంతానికి వాడుకోగా, మిగిలిన దాన్ని నర్సరీలకు, కూరగాయలు పండించే వారికి అమ్మి ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

తయారీ విధానం

కూరగాయల వ్యర్థాలు, మిగిలిపోయిన అన్నం, తడి చెత్తను ఒక కుండలో గానీ బిన్‌లో గానీ వేసుకోవాలి. కుండ లేదా బిన్ అడుగున ఒక రంధ్రం చేయాలి. దీని ద్వారా చెత్తలోని తేమ బయటకు పోతుంది. ఇలా రోజూ ఇంటిలో మిగిలిన తడి చెత్తను దానిలో వేసుకోవాలి. కుండ, బిన్ చుట్టూ కారం, పసుపు చల్లాలి. దీని వల్ల చీమలు పట్టకుండా ఉంటాయి. ఒక నెల రోజులలోనే కంపోస్ట్ తయారవుతుంది. ఈ సేంద్రియ ఎరువును ఎవరికి వారే తయారు చేసుకునేలా నగర పరిధిలోని సుమారు 5 వేల కుటుంబాలను ఎంపిక చేసి, శిక్షణ ఇచ్చారు.

మంచి దిగుబడి



మహిళలు తమ ఇంటిలో తయారు చేసుకున్న సేంద్రియ ఎరువులను పెరటిలో పెంచుతున్న మొక్కలకు వాడుతున్నారు. దీని వల్ల దిగుబడి పెరుగుతుంది. ఆరోగ్యకరమైన కూరగాయలు తినవచ్చు. మిగిలిన వాటిని విక్రయించడం వల్ల లాభం వస్తుంది.

– శ్రీనివాస్, శానిటరీ సూపర్ వైజర్, కార్పొరేషన్



ఇంట్లోనే సేంద్రియ ఎరువు తయారీ



గెయిల్ వద్ద పండిస్తున్న కూరగాయలు

నేడు కలశ ప్రతిష్ఠా మహోత్సవం

ధవళేశ్వరం: ధవళేశ్వరంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వర స్వామివారి ఆలయం వద్ద నిర్మించిన రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం జరగనుంది. సోమవారం ఉదయం 10.38 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా ఆదివారం నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అంకురారోపణ, పంచగవ్యప్రాశన, ఋత్విక్ వరుణ, రక్షా బంధన ధారణ, వాస్తు, క్షేత్రపాలక, నవగ్రహ సర్వతో భద్ర మంటప ఆరాధనలు జలాధివాసం, క్షీరాధివాసం, సాయంత్రం ఆవాహిత హోమాలు, అధివాస హోమాలు, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పములు, చతుర్వేద స్వస్తి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యకు ప్రాధాన్యం

సీటీఆర్‌ఐ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నాయని పేరెంట్స్ టీచర్స్ అండ్ స్టూడెంట్స్ యూనైటెడ్ ఫెడరేషన్ (పీటీఎస్ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లాపు వేణు అన్నారు. శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రం పైన ఉన్న సర్వరాయ కళామందిర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ళ సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని పి.టి.ఎస్.ఎఫ్. పతాకాన్ని విడుదల చేశారు. ఎఈఎం విద్యాసంస్థల అధినేత కొనకళ్ళ సుదర్శన్‌రావు, కాకర్ల హరిబాబు, చెరుకూరి సత్యనారాయణరాజు, డాక్టర్ కె.బి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

మనది చేతల ప్రభుత్వం



పార్టీలో చేరినవారితో మంత్రి వేణుగోపాలకృష్ణ తదితరులు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణుగోపాలకృష్ణ
- కోనేరుపేటలో వైఎస్సార్ సీపీలోకి 300 మంది చేరిక

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని, టీడీపీ మాదిరిగా హామీ ఇచ్చి గాలికి వదిలేసిన ప్రభుత్వం కాదని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం పిడింగొయ్యి గ్రామపంచాయతీ పరిధిలో కోనేరుపేటలో వైఎస్సార్ సీపీ నేత, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు ఆధ్వర్యంలో జనసేన పార్టీకి చెందిన యజ్జల రాంబాబు నేతృత్వంలో సుమారు 300మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా రాంబాబు, రమేష్, బాలాజీ, మధు, సుభాని, రాజేంద్ర, చిన్ని, వై.శ్రీనివాస్, జరీనా, అభి, నీరజ,కుమారి తదితరులు మంత్రి వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా వైద్యవిభాగ అధ్యక్షురాలు డాక్టర్ అనసూరిపద్మలత, నక్కారాజబాబు తదితరులు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే టీడీపీ నేతలు ఉత్తుత్తి హామీలతో ప్రజలను మోసం చేసేందుకు చూస్తారన్నారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు అతని కార్యకర్తలు, జన్మభూమి కమిటీ సభ్యులే బాగుపడ్డారని, సామాన్య ప్రజలను అణగదొక్కారన్నారు. చంద్రబాబు ఇచ్చిన ఏ హామీని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసగించారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా గుమ్మం వద్దకే అందిస్తామని మంత్రి వేణుగోపాలకృష్ణ తెలిపారు. రాబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి మరోసారి సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని సూచించారు. కోనేరుపేటలో సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆ ప్రాంత ప్రజలకు మంత్రి హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు సుందరపల్లి అనిల్, పిల్లా లక్ష్మణరావు, మేడి త్రిమూర్తులు, నక్కా రాజేంద్ర, మల్లవరపు అన్వేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై రాజీ లేదు.. అవినీతికి తావే లేదు

- సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించాలి
- ప్రజలకు ఎంపీ మార్గాని భరత్‌రామ్ విజ్ఞప్తి
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరుతున్న వారిని స్వాగతిస్తున్న ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): వైఎస్సార్ సీపీ పాలనలో అభివృద్ధి విషయంలో ఎటువంటి రాజీ లేదని, అలాగే అవినీతికి తావే లేదని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక నారాయణపురం వాంబే కాలనీ వద్ద, ఒకటో వార్డు సాయిదుర్గా నగర్‌కు చెందిన యువత, మహిళలు ఆదివారం టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎంపీ భరత్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీలో చేరడమంటే అభివృద్ధిని స్వాగతిస్తున్నట్లేనని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారని, అలాగే అభివృద్ధికి అగ్రపీఠం వేస్తున్నారని చెప్పారు. గత చంద్రబాబు పాలనలో అవినీతి, అక్రమాలకు అంతే లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. పింఛన్ అందాలన్నా, రేషన్ కార్డు కావాలన్నా గంటల తరబడి క్యూలో నిలబడితే.. వస్తే వచ్చేది.. లేదంటే లేదన్న పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. పింఛన్ మంజూరు కావాలంటే టీడీపీ నేతలు, జన్మభూమి కమిటీల చుట్టూ చెప్పులరిగేలా ప్రదక్షిణలు చేసి, లంచాలిస్తే.. అప్పుడైనా అదృష్టం బాగుంటే ఇచ్చేవారని అన్నారు. పింఛన్ లబ్ధిదారు ఎవరైనా మరణిస్తేనే ఆ ఖాళీని భర్తీ చేసే దుస్థితి ఉండేదని చెప్పారు. దీనికి భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హతే ప్రామాణికంగా నాయకుల ప్రమేయం కూడా లేకుండా అసలైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి, సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎంపీ భరత్ రామ్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, మానే దొరబాబు, ముప్పన ప్రభాకర్, రాయుడు గణేష్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు మార్తి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- ధవళేశ్వరం ఎస్ఎంఈ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



మంత్రి వేణును సన్మానిస్తున్న చర్చి సంఘ పెద్దలు

ధవళేశ్వరం: ప్రజాసేవే పరమావధిగా వలంటరీ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రభుత్వ పథకాలను నేరుగా పేద ప్రజల ఇంటి వద్దకే అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో–ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ధవళేశ్వరం ఎస్ఎంఈ చర్చిలో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలోని పేద ప్రజల ఆర్థిక అభ్యున్నతి కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఎటువంటి విఘాతం లేకుండా నిర్విఘ్నంగా కొనసాగించేలా దేవదేవుడైన ఏసుక్రీస్తు దీవెనలు అందించాలని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లోనే ప్రజా సేవే లక్ష్యంగా పేద ప్రజల అభివృద్ధిని కాంక్షిస్తూ పనిచేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజా సేవ చేయాలని లక్ష్యంతో వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులైన లబ్ధిదారులకు ఇంటి వద్దకే శరవేగంగా అందిస్తున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకునేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారని పేర్కొన్నారు. తాను పాలకుడును కాదని సేవకుడిని మాత్రమే అని ప్రజా సేవ తన కర్తవ్యం అని మంత్రి వేణు అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎంఈ లూథరన్ చర్చి సంఘ అడహక్ కమిటీ సభ్యులు స్థానిక బరియల్ గ్రౌండ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి వేణుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ పది రోజుల్లో సమస్య పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సంఘ నాయకుల ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. చర్చి పాస్టర్ అనీల్‌కిరణ్ ,సంఘ పెద్దలు తలారి వరప్రసాద్, అయితాబత్తుల ప్రసాద్, బోడపాటి కుమార్, జె.ప్రవీణ్, బీరా బాబురావు, ఇమ్మానియేల్, లలితా మోజెస్ పాల్గొన్నారు.

జగనన్న వల్లనే అభివృద్ధి

- ఎమ్మెల్యేగా గెలిపించండి.. మీ ఇంటి పెద్ద కొడుకుగా ఉంటా
- నగరంలోని 1వ వార్డులో పర్యటించిన ఎంపీ భరత్



1వ డివిజన్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్‌ఐ: నగరాన్ని ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామంటే అది కేవలం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహం, సహకారం వల్లనేనని రాజమహేంద్రవర ఎంపీ, సిటీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆదివారం నగరంలోని ఒకటవ వార్డు సెంట్రల్ జైలు రోడ్డులోని మరనాత చర్చి వద్ద నుంచి నిర్వహించిన 'గుడ్ మార్నింగ్' కార్యక్రమంలో ఎంపీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ వీధి వీధికీ, ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. వారి కుటుంబ వ్యవహారాలు, ఆర్థిక పరిస్థితులు, వార్డులో సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికలలో రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని..ఆశీర్వదించమని అభ్యర్థించారు. తనని ఎమ్మెల్యేగా గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని మాటిచ్చారు. ఎంపీగా నగరంలో చేసిన అభివృద్ధిని వివరించారు. కంబాలచెరువు పార్కు, రోడ్డు, డివైడర్స్, మొక్కల పెంపకం, పార్కుల అభివృద్ధి..ఇలా ఒకటొకటిగా వివరిస్తూ గతంలో కన్నా నగరం బాగుందా లేదా అని ప్రశ్నించారు. మీరొచ్చిన తరువాత నగరం చాలా బాగుందని, ఎమ్మెల్యేగా కూడా మిమ్మల్నే గెలిపిస్తామని ఆ వార్డులో ప్రజలు ఎంపీకి చెప్పారు. సీఎంగా జగనన్న, రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యేగా నన్నూ గెలిపిస్తే తప్పకుండా మీ ఇంటి పెద్ద కొడుకుని అవుతానన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి ముప్పాన ప్రభాకర్, మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత అజ్జరపు వాసు, మానే దొరబాబు, నగర వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, ఒకటవ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు, పలువురు మహిళలు, పార్టీ కార్యకర్తలు, వార్డు పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైద్యులకు సింపతీతోపాటు ఎంపతీ కూడా ఉండాలి



వైద్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రదీప్



సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు

రాజానగరం: వైద్య వృత్తిని చేపట్టిన వారు సింపతీ (సానుభూతి) లక్షణంతోపాటు ఎంపతీ (సహానుభూతి)ని కూడా అలవర్చుకోవాలని, అప్పుడే సమాజంలో మంచి వైద్యులుగా గుర్తింపును పొందుతారని సాఫ్ట్ స్కిల్ ట్రైనర్, టీవీ, సినీనటుడు కేవీ ప్రదీప్ అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే సందర్భంగా నిర్వహించిన 'ఉద్భవ్' కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. వైద్య వృత్తితో పాటు ఏదీ కూడా పుట్టుకతోనే అబ్బదని, దృష్టిని కేంద్రీకరించి నేర్చుకునే విద్యలో నైపుణ్యాలను సాధించవచ్చన్నారు. ప్రపంచంలో నేనొక్కడినే 'సింగిల్ సిప్', నాలా మరెవ్వరూ ఉండరనే వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ నమ్మి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే లక్ష్యాలను సాధించగలరన్నారు. టీవీలలో నటన, దర్శకత్వం, రచన వంటి విభాగాలలో ప్రయోగాత్మకంగా రికార్డులు సృష్టించిన తనకు నటుడిగా సంతృప్తి ఉందన్నారు. అయితే ఇతరుల కంటే భిన్నంగా ఉండాలనే ఆలోచనతో మోటివేషనల్ స్పీకర్‌గా వృత్తిని ప్రారంభించానన్నారు. 'నీ చరిత్రకు నీవే రచయితవు కావాలి, నీ కథ ఎవరూ రాయరు' అనడానికి తననే ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ప్రదీప్‌ను జీఎస్ఎల్ యాజమాన్యం డాక్టర్ గన్ని భాస్కరరావు, డీన్ డాక్టర్ వైవీ శర్మ, ప్రిన్సిపాల్ గురునాథ్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎం మిశ్రా, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీహరిబాబు ఘనంగా సన్మానించారు. అనంతరం వైద్య విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో అబ్బురపరిచారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

కొవ్వూరు: ఔరంగబాద్ ఇసుక ర్యాంపు గేటు ఎదురుగా గోదావరి నదిలో ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి చేతిపై ఐ లవ్ యూ డాడీ, మోహన్ అని పచ్చబొట్టు ఉందని హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబూరావు తెలిపారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లభించలేదన్నారు. వివరాల కోసం పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కొవ్వూరు: పెనకనమెట్ట గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న పసలపూడి సుబ్బారావును ఆదివారం అరెస్టు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. అతని నుంచి ఆరు క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

విస్తృత ఏర్పాట్లు చేసిన భక్తబృందం



వారం రోజుల పాటు స్వామివారి సేవకు సిద్ధమైన గోవింద మాలధారులు

కడియం: మండలంలోని దుళ్ళలో గల శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. 18 నుంచి 24వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాలకు ఆలయ భక్తబృందం విస్తృత ఏర్పాట్లు చేసింది. వారం రోజులపాటు సాగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా 52 మంది భక్తులు గోవింద మాలలు ధరించారు. వారం రోజుల పాటు స్వామివారి కైంకర్యాల్లో వీరంతా స్వచ్ఛంద సేవలందిస్తారు. 19వ తేదీ ఉదయం పూజా సంకల్పంతో ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త అద్దంకి శ్రీనివాస్, అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు, భక్త బృందం సభ్యులు తెలిపారు. అయిదు రోజుల పాటు ప్రతి రోజూ రథం, ఒక్కో వాహనంపై వేంకటేశ్వర స్వామివారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 19వ తేదీ సోమవారం రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ ఉంటుందన్నారు. 20వ తేదీ ఉదయం 9.45కి స్వామివారి కల్యాణం, రాత్రి 7 గంటలకు గరుడవాహన సేవ జరుగుతాయన్నారు. 21వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు సుదర్శన హోమం, సింహవాహన సేవ ఉంటాయన్నారు. 22వ తేదీ ఉదయం 9 గంటలకు అన్నకూటోత్సవం, హనుమంతవాహన సేవ జరుగుతాయన్నారు. 23వ తేదీ ఉదయం 9 గంటలకు లక్ష్మీహోమం, సామూహిక కుంకుమార్చనలు, రాత్రి ఏడు గంటలకు హంసవాహన సేవలు ఉంటాయని వివరించారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు చక్రస్నానం, రాత్రి ఏడు గంటలకు శ్రీపుష్పయాగం జరుగతాయని తెలిపారు. ప్రతి రోజూ స్వామివారికి సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ ఉంటుందన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సుందరంగా విద్యుద్దీపాలతో అలంకరించారు.